

# రీసెర్చ్

—సీను

మెస్‌లో బ్రేక్ ఫాస్ట్ చేసి లాబ్ కేసి నడుస్తుంటే ఎందుకో దిగులుగా, భయంగా అన్పించింది. నేను 'రీసెర్చి'కి పనికి రానేమో నని ఎప్పట్లాగే మళ్ళీ అనుకుంటూ లాబ్‌లోకి అడుగుపెట్టాను. రిజిస్టర్‌లో సంతకం చేసి నా టేబుల్ వైపు కదిలాను. రామానుజన్ ఎన్నింటికి వచ్చాడో కానీ సీరియస్‌గా పని చేసుకుంటు న్నాడు. అతన్ని డిస్టర్బ్ చేయడం ఇష్టం లేక విష్ చేయకుండానే నా డెస్క్ దగ్గరికి వెళ్ళాను.

'ఈరోజు ఏం పని చేయాలా' అని ఆలోచి స్తుండగానే మా 'సైంటిస్ట్' వచ్చి "ఏంటీ! నిన్నటి 'రియాక్షన్' ఇంకా అవలేదా?" అన డిగాడు.

"అయ్యింది సార్! కాంపౌండ్ ప్యూరిఫై చేయాలి" అన్నాను.

"తొందరగా చేసి అనాలిసిస్‌కి ఇవ్వు. ఇంత చిన్న పనికి కూడా ఇంత టైం తీసుకుంటే ఎట్లా?" అన్నాడు. మొహంలో లేని సీరియస్ నెస్ గొంతులో కనిపించింది. నేనేమీ సమా ధానం ఇవ్వక పోయేసరికి చేంబర్ వైపు కది లాడు.

'స్టిరరర్' అవసరమై రామానుజన్ దగ్గరికి వెళ్ళి అడిగాను.

"రామానుజన్! ఒకసారి 'స్టిరరర్' ఇస్తావా?"

"ఎంతసేపట్లో ఇవ్వగలవు? నాకు అర్ధ గంటలో కావాలి" అన్నాడు రామానుజన్.

"అర్ధగంటలో కాదు కానీ రెండు గంటల్లో ఇవ్వగలను" చెప్పాను.

"సారీ! రెండు గంటలంటే నేనివ్వలేను" నిష్కర్షగా చెప్పాడు. నాకు తెలుసు అతడు దాన్ని ఆ రోజు మొత్తంలో కూడా యూజ్ చేయడని!

ఆ రోజు పెట్టే 'రియాక్షన్' కోసం 'హుడ్' శుభ్రం చేస్తుంటే ముఖ్ చిట్లించుకుంటూ వచ్చాడు.

"నువ్వు వాడేది 'ఇన్‌ఫ్లేమబుల్' గ్యాస్. ఆ ప్రక్కనే నా రియాక్షన్ నడుస్తుంది. కాబట్టి ఇప్పుడు నీవు రియాక్షన్ పెట్టడానికి వీల్లేదు."

"ఇన్‌ఫ్లేమబుల్ గ్యాస్ అయితేంటి? ఎక్కడా ఫ్లేమ్స్ వాడడం లేదు. మిగతా జాగ్ర త్తలు కూడా తీసుకుంటున్నాను కదా!" కొంచెం తీవ్రంగానే అన్నాను.

"అయినా సరే! ఇప్పుడు నీవు ఇక్కడ 'రియాక్షన్' పెట్టకూడదు" అన్నాడు.

జాగ్రత్త కంటే అడ్డుపడాలనే దుగ్ధే ఎక్కువ కన్పించింది. అయినా ఏమీ చేయలేని నిస్స హాయత. ఆ పనిని పోస్ట్‌పోన్ చేసి నిన్నటి కాంపౌండ్‌ని ప్యూరిఫై చేసి అనాలిసిస్‌కి ఇచ్చాను.

ప్రియంవద పూనె నుండి ఉత్తరం వ్రాసింది. ప్రియంవద యం.యస్సీలో నా క్లాస్‌మేట్. నేను రీసెర్చిలో ఇక్కడే ఇన్‌స్టి ట్యూట్‌లో చేరాను. ఆమె పూనెలో రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌లో చేరింది. "బిగ్ ప్లేసెస్ హావ్ బిగ్ పాలిటిక్స్, సైన్స్ వితవుట్ పాలిటిక్స్ వుడ్ బి బెటర్" అని వ్రాసింది. నాకు నిజమేనన్పించింది.

ఒక 'సైంటిస్ట్' దగ్గర పని చేసే స్కాలర్‌కి మంచి రిజల్ట్స్ వస్తే ఇంకో 'సైంటిస్ట్'కి అసూయ. కెమికల్ గాని, 'అపరాటస్' గాని అవసరమొస్తే ఇవ్వకపోవడం, సైంటిస్ట్‌లు తమ

కెరీర్‌ను బిల్డప్ చేసుకోవడం కోసం ఇతరులను 'ఎక్స్‌ప్లాయిట్' చేయడం సర్వ సాధారణం. అందుకే ఈ వాతావరణంలో ఇమడలేక పోతున్నాను.

"ఏం స్మార్ట్! ఏమిటి ఆలోచిస్తున్నావు? కొత్త డ్రెస్ అనుకుంటాను, మెరిసిపోతున్నావు" అంటూ వచ్చాడు రాజేష్. ఎందుకో ఆ మాటలు నన్ను ఇబ్బంది పెట్టాయి.

బదులుగా నవ్వాను. నా నవ్వును చూసి నేను అతని కామెంట్‌ని ఎంజాయ్ చేశాననుకొని ఇంకా మొదలెట్టాడు.

"నీకేంటి బాస్! జల్సారాయుడివి. ఎప్పుడూ నీట్‌గా, అప్పుడే ఫ్రిజ్ నుండి తీసిన ఐస్‌క్రీంలా అందర్నీ ఆకర్షిస్తావు. మన లేబ్‌కు నీవు ప్రధానాకర్షణ అనుకో!" పొగడ్త-లౌక్యంలో భాగం.

నేనేమీ మాట్లాడకపోయేసరికి టాపిక్ మార్చాడు.

"అవును! రవికి జ్వరమొచ్చిందంట. అందుకే రెండు రోజుల్నుండి లేబ్‌కి రావడం లేదు తెల్సా"

"తెలియదే! ఎవరూ చెప్పలేదు కూడా" అన్నాను. రవి నాకు సీనియర్. మంచి ఫ్రెండ్ కూడా.

"ఈ రోజు సైంటిస్ట్‌లు, స్కాలర్స్ అందరూ రవిని చూడ్డానికి వెళ్తున్నారు. నువ్వూ వస్తావా" అడిగాడు రాజేష్.

ఆ గ్రూప్‌తో కలిసి వెళ్ళాలని లేకపోయినా వెళ్ళాను. అందరూ పదిహేను మంది దాకా వేన్‌లో బయల్దేరాం. నాకు చాలా ఆశ్చర్యమేసింది— ఎంతో లౌక్యంగా, యాంత్రికంగా వుండే వీరిలో ఇతరుల గురించి ఇంత ఆపేక్ష, స్పందన వున్నాయా అని.

అందర్నీ చూసి రవి చాలా సంతోషించాడు. రవి ఎంత మంది పట్ల అయిష్టతను మనసులో దాచుకోగల్గితే, ఎంత 'నిశ్శబ్దంగా' వుంటే ఇంత మంది అభిమానాన్ని సంపాదించగల్గాడో అనుకున్నా.

ఎందుకంటే నాకు తెల్సు. అందరి ఇష్టాయిష్టాలు ఎలా వుంటాయో. అవతలి వారికి మంచి సలహా ఇచ్చినా వారి 'అహం' దెబ్బతిని అయిష్టతకు దారి తీస్తుంది. 'మంచివాడు' అనిపించుకోవాలి అంటే ఎవరికీ సలహాలు ఇవ్వకూడదు. వాళ్ళేది చెప్పినా వినాలి, ఏది చెప్పినా చేయాలి, అయిష్టతను లోపల దాచుకొని ఇష్టంగా, డిప్లమాటిగ్గా ప్రవర్తించాలి. ఇట్లాంటి లక్షణాలేవీ లేనందువల్ల నేను చాలా మందికి అయిష్టున్నయ్యానని చెప్పాలి.

పలకరింపులు అయ్యాక అందరం బయల్దేరాం. వ్యాన్‌లో నా పక్కనే కూర్చున్న సుధాకర్‌ని అడిగాను—

"ఏం సుధాకర్! రీసెర్చి వర్క్ ఎట్లా జరుగుతోంది? ఈ మధ్య సరిగా పని చేయడం లేదని విన్నాను"

అందుకు సుధాకర్ నవ్వాడు.

"దేని గురించైనా అడగొచ్చు బాస్! కాని వర్క్ గురించి మాత్రం అడగొద్దు. వర్క్ చేస్తుంటాం. కానీ రిజల్ట్స్ రావు. రిజల్ట్స్ రాకపోతే మనం పని చేస్తున్నామన్నా ఎవరూ నమ్మరు. ఎప్పుడూ వర్క్‌లోడ్, పైగా పై నుండి ప్రెషర్. గత జన్మలో ఏదో పెద్ద తప్పు చేసినట్టున్నాం. అందుకే ఈ జన్మలో రీసెర్చి స్కాలర్‌గా పుట్టాం"

> వర్తమాన సమాజంలో ప్రతి మనిషిలోనూ అసంతృప్తి, పరాయీకరణ పెరిగిపోతోంది. సమాజపు 'ఉనికి'లో వుంటున్నా తనకేమీ ప్రాధాన్యత వుండడం లేదనీ, తను విడిగా వుంటున్నాననీ అనుకోవడమే ఆ అసంతృప్తికి కారణం. అందుకే పక్కవాళ్ళ మంచి సానుభూతి లభిస్తే సంతోషిస్తాడు. అయితే, ఆ సానుభూతి కూడా వొట్టి నటనేనని తెలిస్తే?

చివరి వాక్యానికి నాకు నవ్వొచ్చింది.

"అదేంటి సుధాకర్ అట్లా మాట్లాడుతావు. రీసెర్చి అంటే సక్సెస్ వుంటుందీ, ఫెయిల్యూర్స్ వుంటాయి. ఆప్టిమిస్టిగ్గా వుండాలి కానీ ఇలా దిగాలు పడితే ఎలా?" సమాధానమైనా సలహాలాగా అనిపించింది.

"అవును! ఫెయిల్యూర్స్, సక్సెస్ వుంటాయి. కానీ ఫెయిల్యూర్స్ తొంభై శాతం వుండి, సక్సెస్ పది శాతం. కొన్నిసార్లు ఆ పది శాతం కాకుండా కూడావుంటే ఎలా ఆప్టిమిస్టిగ్గా వుండమంటావు?" నిరాశ ధ్వనించేలాగా అన్నాడు.

"సిటన్నింటినీ భరించి ముందడుగు వేస్తేనే స్కాలర్ కానీ, సైంటిస్ట్ కానీ సక్సెస్ అవుతాడు" అన్నాను. కానీ నాకూ అసాధ్యమేననిపించింది.

ఈ మధ్య నాలో 'పెసిమిజం' పెరిగిపోతోందని ప్రియంవద అన్న మాటలు గుర్తొచ్చాయి. కొంతమందిలా ఫెల్లోషిప్ తీసుకుంటూ రీసెర్చినీ, జీవితాన్నీ తేలిగ్గా తీసుకుంటూ ఎంజాయ్ చేయలేకపోతున్నాను. సక్సెస్ మరీచికలా వూరిస్తుంది, వుడికిస్తుంది. లాబ్- తప్పితే రూం, బయట ప్రపంచంతో సంబంధం లేకుండా జీవితం చర్విత చరణంలా నడుస్తుంది. ఈ రకంగా మేం సిటీలో వున్నా ఒకటే, అంటార్కిటికాలో వున్నా ఒకటే. ఇంకా అక్కడైతే 'కాలుష్యం' బారి నుండైనా తప్పుకోవచ్చు.

ఆ రోజు ఎందుకో ఒళ్ళు బరువుగా, తల నొప్పిగా అనిపించింది. పర్మిషన్ తీసుకొని రూంకి వెళ్ళి ఓ టాబ్లెట్ వేసుకొని పడుకున్నాను. సాయంత్రం అయ్యేసరికి తీవ్రంగా జ్వరం. నా రూమ్మేట్‌ని తీసుకుని డిస్పెన్సరీకి వెళ్ళి వచ్చాను. జ్వరం వల్ల రెండో రోజు కూడా లేబ్‌కి వెళ్ళలేకపోయాను.

ఆ రోజు సాయంత్రం మగత నుండీ కళ్ళు విప్పేసరికి నా లేబ్‌మేట్స్ కన్పించారు. పదిహేను మంది దాకా వచ్చారు. నాకు చాలా ఆనందమనిపించింది. లాబ్‌లో వైషమ్యాలను వదులుకొని నన్ను చూడ్డానికి రావడం అపురూపమనిపించింది. జ్వరం సంగతి విచారించి సానుభూతి వచనాలు పలికారు.

"నీవు లేకపోతే లాబ్‌లో ఏదో వెలితిగా చిన్నపోయినట్లనిపించింది రమేష్"

ఇదేమిటి? ఈ మాటలెక్కడో ఇంతకు ముందు విన్నానే. అవును... ఇవే మాటలు రవిని పరామర్శించడానికి వెళ్ళినపుడు అతనితో కూడా అన్నారు. అవును... గుర్తుంది. అప్పుడూ ఇలాగే అన్నారు, ఇలాగే నవ్వారు.

'డిప్లమసీ...' ఎవరికి ఇష్టంగా వాళ్ళ దగ్గర మాట్లాడ్డం! అంతే.

మాకూ హృదయముందనీ, మేమూ స్పందిస్తామనీ తెలియజెప్పడం కోసం ఇటువంటి ప్రదర్శన! పక్కవాళ్ళ పట్ల సహజంగా కలిగిన స్పందన కాదు!! అంతటితోనాకు కలిగిన ఆనందం ఆవిరయిపోయింది. నవ్వుతూ ఆప్యాయతతో ఏదో మాట్లాడుతున్నా లోపలేదో శూన్యంగా వున్నట్టనిపించింది. అందరం స్పందించే మనుషులమైనట్టు కాకుండా 'లేబ్'లో పరికరాలమైనట్టు అనిపించింది.